సాక్షి
మహబూబ్‌నగర్
శనివారం, 15, జూలై, 2023



అభ్యర్థులకు పరీక్ష..
ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తుండటంతో నిరుద్యోగులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.
వివరాలు 8లో ▸



శాకాంబరిదేవిగా జోగుళాంబ
జోగుళాంబ అమ్మవారు శుక్రవారం భక్తులకు శాకాంబరి దేవిగా దర్శనమిచ్చారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.7 /22.3

వాతావరణం
ఉదయం నుంచి మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా వెంకటేష్ దోత్రే

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా వెంకటేష్ దోత్రే నియమితులయ్యారు. కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా ఉన్న ఈయన బదిలీపై జిల్లాకు వచ్చారు. ఇక్కడ అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న తేజాస్ నందలాల్ పవార్ పదోన్నతిపై వనపర్తి కలెక్టర్‌గా వెళ్లగా.. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ స్థానం అదనపు బాధ్యతలు రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు నిర్వహించారు.

ముగ్గురు పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు

మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్ శాఖలో పనిచేస్తున్న ముగ్గురు పోలీస్ సిబ్బందికి ఉత్తమ సేవా పతకం, మరో 8 మందికి సేవా పతకం 2023 నూతన సంవత్సరానికి అందిస్తూ రాష్ట్ర హోంశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పతకాలకు ఎంపికైన 11 మంది పోలీస్ సిబ్బందిని ఎస్పీ కె.నరసింహ అభినందించారు. ఉత్తమ సేవా పతకం లభించిన వారిలో వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ బి.శేఖర్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ జి.పురేందర్, హెడ్‌కానిస్టేబుల్ రఘునాథ్‌రెడ్డి ఉన్నారు. అలాగే సేవా పతకాలు దేవరకద్ర ఏఎస్‌ఐ ఏబీ ప్రసాద్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.కృష్ణాజీ, మిడ్జిల్ హెడ్‌కానిస్టేబుల్ జి.శ్రీనివాసులు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్, వన్‌టౌన్ పీఎస్ ఏఎస్‌ఐ సి.శివయ్య, కోయిలకొండ పీఎస్ ఎస్.సాయినిర్మలాదేవి, రూరల్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ కె.ఫిలిప్, రాజాపూర్ హెడ్‌కానిస్టేబుల్ పి.కృష్ణారెడ్డిలకు లభించాయి.

పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి మూడో శనివారం కచ్చితంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని డీఈఓ రవీందర్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో ఎంఈఓలు, అధికారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సమావేశానికి ప్రత్యేకంగా ఎజెండా తయారు చేసుకుని పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల చదువు అంశాలపై చర్చించాలని, ఇందులో ప్రజాప్రతినిధులను సైతం భాగస్వాములుగా చేయాలని సూచించారు. విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు, నోటుబుక్కులు పంపిణీ చేయాలని, మన ఊరు– మన బడిలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభంలో ఉన్నందున బోధన అభ్యసన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో కోఆర్డినేటర్ బాలు యాదవ్, ఏఎంఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

17న గురుకుల ఉపాధ్యాయుల ధర్నా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో గురుకుల ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద నిరసన చేపడుతున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ఏకలవ్య, మోడల్, గురుకులాల ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

మహ్మద్‌హుస్సేన్‌పల్లి బీటీకి రూ.3.30 కోట్లు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని మహ్మద్‌హుస్సేన్‌పల్లి– నిజాలాపూర్ బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వర్షాకాలంలో అడుగు తీసి అడుగేయలేని దుస్థితిలో ఉన్న మట్టి రోడ్డును బీటీగా మార్చేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి పీఆర్ ద్వారా నిధులు విడుదల చేయించారు. మహ్మదుస్సేన్‌పల్లి నుంచి నిజాలాపూర్ వరకు 3 కిలోమీటర్ల మేర బీటీగా మార్చేందుకు రూ.3.30 కోట్లను మంత్రి నిరంజన్‌రెడ్డి మంజూరు చేయించినట్లు సర్పంచ్ నిర్మల తెలిపారు. బీటీ రోడ్డు కోసం నిధులు రావడంతో గ్రామస్తులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. మంత్రి చిత్రపటానికి పంచాయతీ కార్యాలయం వద్ద క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఆన్‌లైన్‌లో టెండర్లు పూర్తయి నెల రోజుల్లో పనులు మొదలు కానున్నట్లు సర్పంచ్ వెల్లడించారు.

'సాక్షి'లో కథనాలు..
మహ్మదుస్సేన్‌పల్లి– నిజాలాపూర్ గ్రామాల మధ్య ఉన్న శివారు రోడ్డుతో గ్రామస్తుల కష్టాలను కళ్లకు కట్టినట్లు 'సాక్షి' దినపత్రికలో పలుమార్లు వచ్చిన కథనాలు నేతలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. గతేడాది అక్టోబర్ 31న 'శివారు రోడ్డుపై పట్టింపులేదా?' శీర్షికన కథనం ప్రచురితమైంది. తాజాగా మే 22న 'శివారు రోడ్లపై చిన్నచూపేలా..' శీర్షికన మరో కథనం వెలువడింది. ఎట్టకేలకు మహ్మదుస్సేన్‌పల్లి– నిజాలాపూర్ గ్రామాల మధ్యన ఉన్న రోడ్డుకు నిధులు మంజూరు కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అయ్యో.. రైతన్న

రైతులు వ్యవసాయ సీజన్‌లో పెట్టుబడికి ఇబ్బందులు పడకూడదు.. **ప్రైవేట్ వ్యాపారుల వద్ద వడ్డీలకు అప్పు తెచ్చి ఆర్థికంగా చితికిపోకూడదు..** అనే సదుద్దేశం**తో దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతుబంధు పథకం తీసుకొచ్చాం. ఏటా రెండు పర్యాయాలు ఎకరాకు రూ.5 వేల చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తున్నాం.**

■ బీఆర్‌ఎస్ అధినేత, సీఎం **కేసీఆర్‌తో సహా** మంత్రులు చాలా సందర్భాల్లో చెప్పిన మాటలు ఇవి. కానీ, బ్యాంకర్లకు ఇవేమీ పట్టడం లేదు. రైతులు తీసుకున్న పంట రుణాలకు సంబంధించి రెన్యువల్ చేసుకోవాలంటూ రైతుబంధు డబ్బులు ఇవ్వకుండా కొర్రీలు పెడుతున్నారు. రుణమాఫీ కాకపోవడమే కారణమంటూ.. కనీస సమాచారం ఇవ్వకుండానే వారి ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నారు. దీంతో అన్నదాతలు విధి లేక ఖరీఫ్ పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు.

సాక్షి ఫోకస్

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

పూర్తిస్థాయిలో అమలు కాని రుణమాఫీ
- ఉమ్మడి జిల్లాలో రెన్యువల్ కోసం బ్యాంకర్ల కొర్రీలు
- బ్యాంక్ ఖాతాల్లో జమ అయిన రైతుబంధు డబ్బుల ఫ్రీజ్
- కొన్ని మండలాల్లో ధాన్యం డబ్బులు సైతం ఇవ్వకుండా వేధింపులు
- పెట్టుబడికి ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు



రైతులు తీసుకున్న రూ.లక్షలోపు పంట రుణాలను మాఫీ చేయనున్నట్లు 2018 ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2014లో రుణమాఫీ అమలు చేస్తామని చెప్పామని.. చెప్పినట్లే చేశామని.. ఈసారి కూడా మాఫీ చేస్తామని ఉద్ఘాటించారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగా.. వెంటనే రుణమాఫీ అమలవుతుందని రైతులు ఆశించారు. కానీ, ప్రభుత్వం మాత్రం రూ.25 వేలు, రూ.50 వేలు, రూ.75 వేలు, రూ.లక్ష.. ఇలా విడతల వారీగా రుణమాఫీ అమలు చేస్తూ వచ్చింది. ఇప్పటి వరకు రూ.50 వేల వరకు రైతుల పంట రుణాలు మాఫీ చేసినట్లు చెబుతున్నారు. దీనిపై జిల్లాలో ఇటు లీడ్ బ్యాంక్ మేనేజర్లు గాని.. అటు వ్యవసాయ శాఖ అధికారులు గాని స్పష్టత ఇవ్వడం లేదు. సైట్ బంద్ అయిందని.. తమకు రైతుబంధు వివరాలు తెలవదని దాటవేస్తున్నారు. అయితే రుణమాఫీ అమలు కాకపోవడంతో బ్యాంకర్లు రైతులను రెన్యువల్ చేసుకోవాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రుణమాఫీకి లింక్ పెట్టి రైతుబంధు డబ్బులను రైతులకు ఇవ్వకుండా.. వారి ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నారు. ఈ పరిస్థితి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రతి మండలంలో నెలకొంది. అంతేకాకుండా పలు మండలాల్లో బ్యాంకర్లు ధాన్యం అమ్మిన రైతులకు సంబంధించిన ఖాతాలను కూడా నిలిపివేసి.. ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

ప్రస్తుత వానాకాలంలో రైతుబంధు వివరాలు..

జిల్లా	రైతుబంధుకు అర్హులు	మంజూరైన మొత్తం	ఎంతమందికి పడ్డాయంటే	జమ అయిన మొత్తం (రూ.కోట్లు)	పెండింగ్‌లోని రైతులు	పెండింగ్ అమౌంట్ (రూ.కోట్లు)
మహబూబ్‌నగర్	2,33,841	230.85	1,97,472	162.44	1,36,825	68.41
నారాయణపేట	1,75,190	225.84	1,55,137	156.51	20,053	69.23
నాగర్‌కర్నూల్	3,16,517	379.91	2,71,799	267.7	44,718	112.21
జోగుళాంబ గద్వాల	1,73,826	232.06	1,45,737	147.43	28,089	84.63
వనపర్తి	1,80,331	184.97	1,58,893	136.39	21,438	48.58

దట్ ఈజ్ ద రూల్..



నారాయణపేట జిల్లా దామరగిద్దలోని ఓ బ్యాంకులో రైతుబంధు డబ్బులు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేశారు. ఈ విషయాన్ని పలువురు రైతులు స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా.. ఆయన బ్యాంకుకు వెళ్లి బ్యాంకర్లకు క్లాస్ తీసుకున్నారు. 'రైతుల అప్పులు పట్టుకోవద్దని చెప్పట్లే.. ఎవరైనా వడ్ల పైసలు, రైతుబంధు డబ్బులు పట్టుకుంటారా.. వారికి అవెర్నెస్ కల్పించి మీ అప్పులు మీరు కట్టించుకోండి.. మీ వ్యాపారం మీరు చేసుకోండి.. కానీ, రైతుల పెట్టుబడి సాయం కోసం వేసిన రైతుబంధు డబ్బులు ఆపే ప్రసక్తే లేదు. రైతులు మందు సంచులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు రైతుబంధు డబ్బులు ఇవ్వాల్సిందే.. దట్ ఈజ్ ద రూల్' అన్నారు. స్పందించిన బ్యాంక్ అధికారులు రైతుబంధు డబ్బులు ఆపకుండా ఇస్తామని చెప్పడంతో రైతులతో ఆయన చప్పట్లు కొట్టించి వెళ్లిపోయారు. ఈ పరిస్థితి ఇక్కడ మాత్రమే ఉంది. మిగతా ప్రాంతాల్లో ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు.

తర్వాత కడతానంటే వింటలేరు..



నాకు మూడు ఎకరాల భూమి ఉంటే రైతుబంధు కింద రూ.16 వేలు బ్యాంకులో పడ్డాయి. అయితే ఇంతకు మునుపు క్రాప్ లోన్ రూ.20 వేలు తీసుకున్నా. దీంతో రైతుబంధు డబ్బులు ఇవ్వకుండా నా ఖాతాను హోల్డ్‌లో పెట్టారు. లోన్ రెన్యువల్ చేసుకుంటూనే ఇస్తామంటున్నారు. వ్యవసాయ సీజన్.. ఇప్పుడు నా దగ్గర పైసలు లేవని.. తర్వాత కడతానంటే బ్యాంకులో అధికారులు వింటలేరు.
– బోయ గోపాల్, తోమాలపల్లి, పెబ్బేరు, వనపర్తి

లోన్ మొత్తం కట్టాలంట



నాకు 3.20 ఎకరాల పొలం ఉంది. గతంలో దామరగిద్ద ఎస్‌బీఐలో రూ.1.20 లక్షలు పంట రుణం కింద అప్పు తీసుకున్నాను. అసలు, వడ్డీ కలిపి ఇప్పుడు రూ.1.60 లక్షలు అయింది. అవి చెల్లించాలని బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ చెబుతున్నాడు. వానాకాలం రైతుబంధు డబ్బులు రూ.17,500 బ్యాంకు ఖాతాలో పడ్డాయి. వెంటనే బ్యాంకు వాళ్లు నా అకౌంట్‌ను హోల్డ్‌లో పెట్టారు. బ్యాంకుకు వెళ్లి రైతుబంధు డబ్బులు ఇవ్వమని అడిగితే.. లోన్ మొత్తం కట్టాలంటున్నారు.
– బోయిని వేణప్ప, కందేన్‌పల్లి, దామరగిద్ద, నారాయణపేట

మిత్తి కడితేనే ఇస్తరంట..



మేము మూడేళ్ల కింద రూ.1.60 లక్షల క్రాప్ లోన్ తీసుకోగా.. ఇప్పుడు మిత్తితో కలిపి రూ.2.30 లక్షలు అయింది. సర్కారు రైతుబంధు పైసలు బ్యాంకులో వేసినా.. తీసుకోవడానికి వస్తలేవు. బ్యాంకుకెళ్లి అధికారులను అడిగితే.. రైతుబంధు డబ్బులు ఆపాం.. అకౌంట్ ఫ్రీజ్ చేశాం.. కనీసం మిత్తి కట్టాలని చెబుతున్నారు. పెట్టుబడికే ఇబ్బందవుతోంది.. ఆ డబ్బులు ఎట్లా కట్టాలో తెలియడం లేదు.
– సేవకుల బుచ్చమ్మ, రైతు, మల్లేపల్లి, రాజాపూర్, మహబూబ్‌నగర్

మాయమాటలు చెప్పిండ్రు



నాకున్న మూడు ఎకరాల పొలంపై రూ.30 వేలు క్రాప్ లోన్ తెచ్చుకున్న. బ్యాంకులో మేం తీసుకున్న క్రాప్ లోన్ మాఫీ చేస్తామని సర్కారు చెప్పింది. మా నాయకులు కట్టకండి.. మాఫీ అవుతాయన్నారు. దీంతో కట్టలే.. అప్పుడు రూ.30 వేలు తీసుకుంటే ఇప్పుడు డబుల్ అయింది. ఆయలనే కట్టుకుంటే మాకు ఒకటికి రెండు కాకుంటుండే. ఇప్పుడు 60 వేలు కడితేనే రెన్యువల్ చేసి నీకు ఫ్రీజ్ అయిన అకౌంట్‌ను తీస్తామంటున్నారు. రాజశేఖర్ సార్ ఉన్నప్పుడు ఒకేసారి మాకు చేసిండు.. అదే ఆశతోటి టీఆర్‌ఎస్ సర్కారు మాఫీ చేస్తది అనుకొని మోసపోయిన.
– విఠలయ్యగౌడ్, రైతు, రాయపల్లి, మహబూబ్‌నగర్

మొన్న ధాన్యం.. నిన్న రైతుబంధు



నా భర్త 2013 దామరగిద్ద బ్యాంకులో క్రాప్ లోన్ కింద రూ.1.20 లక్షలు తీసుకున్నాడు. ఆయన 2015లో చనిపోయిన తర్వాత పొలం నా పేరున మార్చుకోగా.. అప్పు మొత్తం నా పేరున బదిలీ చేశారు. యాసంగి వడ్లు అమ్మగా వచ్చిన రూ.2.57 లక్షలు హోల్డ్‌లో పెట్టారు. వడ్డీ డబ్బులు రూ.34 వేలు కట్టి డబ్బులు తీసుకెళ్లాలని చెప్పారు. చివరకు రూ.10 వేలు వడ్డీ డబ్బులు కట్టగా.. మిగిలిన వడ్ల డబ్బులు రూ.1.47 లక్షలు ఇచ్చి.. బ్యాంకు పాస్‌బుక్కు వారి వద్దే ఉంచుకున్నారు. ఇప్పుడు రైతుబంధు పడగానే మళ్లీ అకౌంట్‌ను హోల్డ్‌లో పెట్టారు. పెట్టుబడికి డబ్బులు లేవని.. ఇవ్వాలని అడిగితే వడ్డీ రూ.24 వేలు కట్టి.. మిగిలిన డబ్బులు తీసుకెళ్లమంటున్నారు. ఇప్పుడు పెట్టుబడికి కష్టమవుతుందని చెప్పినా పట్టించుకోలేదు.
– సంజనోళ్ల రేణుక, బాపన్‌పల్లి, దామరగిద్ద

ఓటరు జాబితా పరిశీలన పూర్తి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రవినాయక్, ఇతర అధికారులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఇంటింటి పరిశీలన, ఓటరు జాబితాలో తొలగింపు ప్రక్రియ పూర్తిచేశామని కలెక్టర్ రవినాయక్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన వివరాలను కలెక్టర్ తెలియజేస్తూ ఓటరు జాబితాలో తొలగింపు పరిశీలనకు సంబంధించి మిగిలిపోయినవి రెండు, మూడ్రోజుల్లో పూర్తిచేస్తామన్నారు. అంతకు ముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు గాను ఈ నెల 20 నాటికి అవసరమైన సిబ్బందిని గుర్తించాలని, అవసరమయ్యే సామగ్రి కోసం రాష్ట్రస్థాయి నుంచి సెంట్రలైజ్డ్ సరఫరా ఉంటుందని, జిల్లాస్థాయిలో సామగ్రి సేకరణకు అవసరమైతే సిద్ధంగా ఉండాలని సూచించారు. అదనపు సీఈఓ లోకేష్ మాట్లాడుతూ ఈవీఎంల డెమో కేంద్రాల ఏర్పాటు, మొదటి స్థాయి తనిఖీ, జిల్లా ఎన్నికల మేనేజ్‌మెంట్ ప్లాన్, కాల్ సెంటర్ల నిర్వహణ, టోల్‌ఫ్రీ నంబర్ 1950పై విస్తృత ప్రచారం తదితర వాటిని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, ఈఆర్‌ఓలు అనిల్‌కుమార్, స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ జ్యోతి, డీఈఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పనులు పూర్తిచేయాలి
జిల్లాలోని పాఠశాలల్లో అభివృద్ధి పనులను ఆగస్టు 31 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 'మన ఊరు– మనబడి'పై జిల్లా విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 291 పాఠశాలల్లో పనులు చేపట్టగా.. ఇప్పటి వరకు 23 పాఠశాలలు ప్రారంభించామని, మరో 18 ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, వాటిని వచ్చేవారం ప్రారంభించేందుకు సంబంధిత ఎమ్మెల్యేల అనుమతితో ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే మరో 12 పాఠశాలల్లో గ్రీన్ బోర్డులు తదితర సౌకర్యాలను సమకూర్చినట్లయితే వాటిని సైతం ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అన్ని పాఠశాలల పనులన్నీ ఆగస్టు 31 నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. అప్పుడే రెండో విడత పాఠశాలల పనులు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

ఐదుగురు సీఐల బదిలీ

- ఆరుగురు ఆర్‌ఐలకు స్థానచలనం

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఐదుగురు సీఐలను మల్టీజోన్–2 ఐజీపీ షానావాజ్‌ఖాసీం ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ ఎస్పీ కె.నరసింహ శుక్రవారం రాత్రి బదిలీ చేశారు. గతంలో ఇప్పటి పలువురు సీఐలను బదిలీ చేయగా కొత్తగా మరి కొందరికి స్థానచలనం కల్పించారు. దీంతోపాటు ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్(ఆర్‌ఐ)లను బదిలీ చేయడం జరిగింది.

సీఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్.రవికుమార్	పీసీఆర్, మహబూబ్‌నగర్	డీఎస్‌బీ- 2 వికారాబాద్
ఎన్.అశోక్	వెయిటింగ్, ఐజీపీ మల్టీ జోన్2	డీటీసీ, మహబూబ్‌నగర్
జి.రజితరెడ్డి	భూత్పూర్	రిపోర్ట్, ఐజీ మల్టీజోన్ 2 ఆఫీస్
ఎస్.రామకృష్ణ	వెల్దండ	భూత్పూర్
పి.శ్రీకాంత్‌రెడ్డి	మరికల్	డీఎస్‌బీ-2 మహబూబ్‌నగర్

ఆర్‌ఐల బదిలీలు..

ఆర్‌ఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
రాఘవరావు	హెడ్‌క్వార్టర్స్, మహబూబ్‌నగర్	హెడ్‌క్వార్టర్స్, నాగర్‌కర్నూల్
అప్పలనాయుడు	హెడ్‌క్వార్టర్స్, మహబూబ్‌నగర్	హెడ్‌క్వార్టర్స్, వనపర్తి
శ్రీనివాస్‌కుమార్	హెడ్‌క్వార్టర్స్, మహబూబ్‌నగర్	హెడ్‌క్వార్టర్స్, వనపర్తి
నగేష్	హెడ్‌క్వార్టర్స్, గద్వాల	హెడ్‌క్వార్టర్స్, మహబూబ్‌నగర్
పి.శ్రీను	హెడ్‌క్వార్టర్స్, నల్లగొండ	హెడ్‌క్వార్టర్స్, మహబూబ్‌నగర్
ఎం.విద్యాసాగర్	ఐఎస్‌డబ్ల్యూ, హైదరాబాద్	పదోన్నతి ఆర్‌ఐ పోస్టింగ్ హెడ్‌క్వార్టర్స్ మహబూబ్‌నగర్

అభివృద్ధి పనులపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూనగర్): ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై దృష్టిసారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలోని చాంబర్‌లో జిల్లా పరిషత్ గ్రామీణాభివృద్ధి, విద్య– వైద్యం స్టాండింగ్ కమిటీల సమావేశాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రారంభంకాని పనులను వెంటనే ప్రారంభించాలని, పనులను అధికారులు పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వానాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని, హరితహారం కార్యక్రమానికి సన్నద్ధం కావాలని, వానాకాలంలో మిషన్ భగీరథ నీరు కలుషితం కాకుండా అందించాలన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతి గ్రామానికి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని జిల్లాలో ఇంకా గుర్తించనివి ఉంటే వెంటనే గుర్తించి పూర్తి చేయాలన్నారు. పంచాయతీ పరిధిలో వెలిసే వెంచర్లలో గ్రామ అభివృద్ధికి అవసరమైన 10శాతం భూమిని పంచాయతీలకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు విజయ్‌భాస్కర్, డిప్యూటీ సీఈఓ మొగులప్ప, డీఆర్డీఓ యాదయ్య, మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే జెడ్పీ వ్యవసాయశాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ యాదయ్య ఆధ్వర్యంలో వ్యవసాయ, స్త్రీ, శిశు సంక్షేమ స్థాయీ సంఘం చైర్మన్ వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు.

'పాలమూరు ప్రజాభేరి' కోఆర్డినేటర్ల నియామకం

సాక్షి, నాగర్‌కర్నూల్: కొల్లాపూర్‌లో ఈ నెల 20న కాంగ్రెస్ చేపట్టనున్న 'పాలమూరు ప్రజాభేరి' భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కోఆర్డినేటర్లను నియమించారు. కార్యక్రమానికి ప్రోగ్రాం కోఆర్డినేటర్లతోపాటు ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నేతలకు కోఆర్డినేటర్లుగా బాధ్యతలు అప్పగించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్లుగా మహేశ్‌కుమార్‌గౌడ్, చిక్కుడు వంశీకృష్ణ, ఆర్.అభిలాష్‌రావుతోపాటు మల్లురవి, సంపత్‌కుమార్, జగదీశ్వర్‌రావులను ఓవరాల్ కోఆర్డినేటర్‌గా నియమించారు. అలాగే నియోజకవర్గాల వారీగా నాగర్‌కర్నూల్‌కు ములుగు ఎమ్మెల్యే సీతక్క, కొల్లాపూర్‌కు సిరిసిల్ల రాజయ్య, ఎం.అశోక్‌గౌడ్, గద్వాలకు సీహెచ్.విజయరమణరావు, షాద్‌నగర్‌కు బండ్రు శోభారాణి, మహబూబ్‌నగర్‌కు నాయిని రాజేందర్‌రెడ్డి, జడ్చర్లకు మల్‌రెడ్డి రాంరెడ్డి, వనపర్తికి ఎం.భవానిరెడ్డి, దేవరకద్రకు గండ్ర సత్యనారాయణరావు, అలంపూర్‌కు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, మక్తల్‌కు ఎంబీ.వీరబాబు, కల్వకుర్తికి ఆది శ్రీనివాస్, అచ్చంపేటకు చలమల కిష్టారెడ్డి, నారాయణపేటకు టి.రామ్మోహన్‌రెడ్డి, కొడంగల్‌కు నందికంటి శ్రీధర్‌ను నియమించారు.

పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలి



సమావేశమైన కార్యవర్గ సభ్యులు

పాలమూరు: రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 54 నెలల పీఆర్‌సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వ బోధన వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకిషన్, ప్రధాన కార్యదర్శి కిరణ్ ప్రకాష్ అన్నారు. పాలమూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో శుక్రవారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో సాధారణ బదిలీలు చేపట్టాలని, ముఖ్యంగా ఆరేళ్లపాటు ఒకేచోట పనిచేస్తున్న ప్రొఫెసర్‌లకు వెంటనే బదిలీ చేయాలన్నారు. ప్రభుత్వం ఒక ప్రత్యేక బదిలీ పథకం అమలు చేయాలన్నారు. ఒకే పని ఒకే జీతం రాష్ట్రం మొత్తం హెచ్‌ఆర్‌ఏ తారతమ్యాలు లేకుండా ఒకే జీతం వచ్చేలా ప్రత్యేక వేతన సవరణ జరగాలన్నారు. కొత్త వైద్య కళాశాలల్లో పూర్తిస్థాయిలో మౌళిక సదుపాయాలు కల్పించాలని, సిబ్బందిని నియామించాలన్నారు. శాశ్వత నియామకాలు, పదోన్నతులు, బదిలీలు ఒక పద్ధతి ప్రకారం చేపట్టాలన్నారు. ఆయా సమస్యలపై ప్రభుత్వం స్పదించకపోతే దశల వారిగా సమ్మెకు పిలుపునివ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో కోశాధికారి సిరాజుద్దీన్, ప్రొఫెసర్ రాధ, డాక్టర్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంకర మీదపడి బీహార్ కార్మికుడు మృతి

బాలానగర్: టిప్పర్‌లో కంకర అన్‌లోడ్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు కంకర మీద పడి బీహార్ చెందిన కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ జమ్ములప్ప తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని గౌతాపూర్ శివారులోని ఓ పరిశ్రమ వద్ద టిప్పర్ కంకర ఖాళీ చేస్తున్న సమయంలో బీహార్ చెందిన దేవానంద్ (21) కంకర కింద పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

రాజాపూర్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం మండల పరిధిలోని రంగారెడ్డిగూడ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. రాజాపూర్ ఎస్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ కర్నూల్ జిల్లా వెముగోడు గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా(26) గురువారం తెల్లవారుజామున మోటర్ సైకిల్‌పై వెళ్తూ బస్టాప్ వద్ద జాతీయ రహదారి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి జాఫర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


బొచ్చ చిన్న (ఫైల్)

పెబ్బేరు: జాతీయ రహదారిపై గురువారం ఇసుక ట్రాక్టర్, బైకు ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన బొచ్చ చిన్న చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన బొచ్చ చిన్న హైదరాబాద్ నుంచి గద్వాలకు బైకుపై వెళ్తుండగా పెబ్బేరు నుంచి ఇసుక ట్రాక్టర్ అతివేగంతో ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలతో కర్నూల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతునికి భార్య పల్లవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

ఉరేసుకుని యువతి బలవన్మరణం

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని అమ్మపల్లి చెందిన సన (19) గురువారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాల ప్రకారం.. సన కుటుంబం కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన ఖాజా, గౌసియా దంపతులకు సన ఆత్మహత్య చేసుకోవడం గమనించి వారు బోరున విలపించారు. తమ ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని తల్లి గౌసియా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కారు బోల్తా: తప్పిన ముప్పు



అడ్డాకుల: కారు బోల్తాపడిన ఘటన మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. దేవరకద్ర మండలం లక్ష్మీంపల్లికి చెందిన బైక్ మెకానిక్ భాను వేముల స్టేజీ సమీపంలో షాపు నిర్వహిస్తున్నాడు. బైక్‌ల విడి భాగాల కోసం శుక్రవారం మూసాపేట స్టేజీ వైపు వచ్చి తిరిగి వెళ్తూ జాతీయ రహదారిని క్రాస్ చేస్తుండగా హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న కారు వేగంగా వచ్చింది. ఈక్రమంలోనే కారుడ్రైవర్ బైక్ అడ్డురావడంతో గమనించి సడన్ బ్రేక్ వేశాడు. దీంతో కారు అదుపు తప్పి బోల్తాపడింది. డ్రైవర్ సమయస్ఫూర్తితో వల్ల బైక్‌పై ఉన్న వ్యక్తి ప్రాణాపాయం తప్పి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కారులో ఉన్న ఇద్దరు సైతం ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. రోడ్డుపై అడ్డంగా పడిపోయిన కారును స్థానికులు పైకి లేపి అక్కడి నుంచి తరలించారు. తిరుపతికి చెందిన వారు హైదరాబాద్‌కు వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదానికి గురైనట్లు తెలిసింది. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

బెల్టుషాపులపై దాడి: కేసు నమోదు

భూత్పూర్: మండలంలోని తాటిపర్తిలో శుక్రవారం సాయంత్రం అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న మునాఫ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మద్యం అమ్మకాలు చేపడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. 16 బీరు బాటిళ్లు లభించినట్లు వివరించారు.

మిడ్జిల్: మండలంలోని దోనూర్‌లో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న శేఖర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం 15 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అభ్యర్థులకు పరీక్ష..

- ఉమ్మడి జిల్లాలో ఆరు నెలలుగా పోటీ పరీక్షలకు కసరత్తు..
- కానిస్టేబుల్, ఎస్ఐ, గ్రూప్ 4 పరీక్షలు పూర్తి
- ఉపాధ్యాయ కొలువులకు వచ్చేనెల చివరి వారం నుంచి..
- కేజీబీవీ, గురుకుల, ఏకలవ్య, జేఎల్, డీఎల్ పరీక్షలు
- త్వరలో టెట్ నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం
- గ్రూప్స్ 2,3,1 పరీక్షల్లో దేనికి ప్రాధాన్యం..
- గందరగోళంలో నిరుద్యోగ అభ్యర్థులు


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో పలు డిపార్ట్‌మెంట్లలో ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆరు నెలలుగా నిరుద్యోగ అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఇప్పటికే ఎస్ఐ, కానిస్టేబుల్, గ్రూప్స్4 పాటు టెక్నికల్ పోస్టులకు పరీక్షలు పూర్తయ్యాయి. గురుకుల, కేజీబీవీల్లో టీచర్ పోస్టులు, గ్రూప్స్‌తో జేఎల్, డీఎల్ వంటి పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం తేదీలను సైతం ప్రకటించింది. ఆగస్టు చివరి వారం నుంచి సెప్టెంబర్ వరకు వరుస తేదీలతో పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం తేదీలను ప్రకటించింది. గ్రూప్ 2 పరీక్ష సైతం ఆగస్టు చివరిలో నిర్వహించనున్నారు. వాటితో పాటు మరో సారి టెట్ (టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టు) పరీక్షలో అర్హత సాధించేందుకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వరుస పరీక్షలు నిర్వహిస్తుండగా ఇటు టీచర్ పోస్టులు, అటు గ్రూప్స్ పోస్టుల్లో ఏ పరీక్షకు పాధాన్యత ఇవ్వాలో అర్థం కాక అభ్యర్థులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

డిగ్రీ పూర్తయిన వారికి గ్రూప్స్ మాత్రమే అర్హులు. బీఈడీ, పీజీ ఉన్న అభ్యర్థులు టీచర్, జేఎల్, డీఎల్ పరీక్షలతో పాటు గ్రూప్స్‌కు అర్హులు. టీచర్ పోస్టులకు, గ్రూప్స్‌లో సిలబస్ పూర్తిగా విభిన్నంగా ఉంది. సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మొదటి నుంచి టీచర్ పోస్టులకు సిద్ధమయ్యే వారు దానికే పాధాన్యత ఇచ్చి ప్రిపేర్ కావాలని సూచిస్తున్నారు. కేజీబీవీ, టెట్, హెచ్‌డబ్ల్యూట, డీఎస్సీ, గురుకుల, టెట్‌లకు దాదాపు ఒకే రకమైన సిలబస్ ఉంటుంది. పోస్టులు వేల సంఖ్యలో ఉండడంతో అభ్యర్థులు దీని మీదే దృష్టి పెడితే మంచి ఫలితాలుంటాయని సూచిస్తున్నారు. ఇందులో మెథడ్స్, కంటెంట్, సైకాలజీ వంటి వాటికి, గ్రూప్స్ 1,2,3లలో జనరల్ స్టడీస్ పరిధి ఎక్కువగా ఉన్న వాటికి సిలబస్‌లో చాలా వ్యత్యాసం ఉంది. ఆశకు పోయి అభ్యర్థులు అటూ ఇటూ కాకుండా చదివితే నష్టపోయే అవకాశం ఉంటుంది.

ఈనెల 1న జరిగిన గ్రూప్ 4 పరీక్షలకు సంబంధించిన అభ్యర్థుల హాజరు

జిల్లా	దరఖాస్తు చేసుకున్న వారు	పరీక్షకు హాజరైన వారు
మహబూబ్‌నగర్	34,459	29,540
నాగర్‌కర్నూల్	16,632	14,126
గద్వాల	14,920	12,522
వనపర్తి	13,684	11,725
నారాయణపేట	7,325	6,356
మొత్తం	87,020	74,269

టెట్‌కు ఎవరు సిద్ధం కావాలి..

పీజీ, బీఈడీ పూర్తి చేసి టీచర్ ఉద్యోగం కోసం మాత్రమే సిద్ధమయ్యే వారికి టెట్ పరీక్ష అత్యంత ముఖ్యమైంది. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తేనే టీచర్ పోస్టులకు పరీక్ష రాసేందుకు అర్హులు. ఇటీవల డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన వారు గతంలో టెట్ పరీక్ష రాయని వారు, పరీక్ష రాసి బార్డర్ మార్కులతో ఉత్తీర్ణులైన వారు టెట్‌కు సిద్ధమైతే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

తెలివిగా నిర్ణయం తీసుకోవాలి



ప్రస్తుత పరిస్థితుల్లో అభ్యర్థులకిది కఠిన పరీక్ష వంటిది. ఈ సమయంలో చాలా తెలివైన నిర్ణయం తీసుకుంటే జీవిత లక్ష్యాన్ని చేరుకోవచ్చు. పడ్డ ప్రతి నోటిఫికేషన్‌కూ దరఖాస్తు చేసి గ్రూప్స్, టీచర్ పోస్టులకు రెండింటికి సిద్ధమయితే పొరపాటు జరగొచ్చు. టీచర్ ఉద్యోగమే లక్ష్యంగా చదివే వారు దానికే ప్రిపేర్ కావాలి. గ్రూప్స్ చదివేవారు అదే ప్రిపరేషన్‌ను కొనసాగించాలి. గ్రూప్స్, టీచర్ పోస్టులు పూర్తి భిన్నమైన సబ్జెక్టులు. సొంత సామర్థ్యం, సమయం, ఆసక్తిని పరిగణలోకి తీసుకొని నిర్ణయించుకోవాలి. అనుకున్న సమయంలో సిలబస్ పూర్తి చేస్తే సులువుగా ఉద్యోగం సాధిస్తారు.

– జంగం విశ్వనాథ్, సైకాలజీ అధ్యాపకులు, పాలమూరు యూనివర్సిటీ

రాత్రికి రాత్రే మల్లెలకుంట కబ్జా


ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన మట్టి కుప్పలు

- ఎఫ్‌టీఎల్ పరిధిలో రూ.కోట్ల విలువ చేసే భూమిపై అక్రమార్కుల కన్ను

దేవరకద్ర రూరల్: పట్టణం దినదినాభివృద్ధి చెందుతుంది. ముఖ్యంగా రాయచూర్– హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలను కలిపే ముఖ్యమైన జాతీయ రహదారి కావడంతో ఇక్కడి భూములకు డిమాండ్ పెరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న మల్లెల పాపయ్య కుంట చెరువుపై సమీప భూ యజమానుల కన్ను పడింది. చెరువులోని భూములు అన్ని ఎఫ్‌టీయల్ పరిధిలో ఉన్నప్పటికీ, అక్కడ ఉన్న స్థలం రూ.కోట్లు విలువ చేస్తుండటంతో వారం రోజులుగా అర్ధరాత్రి వాహనాల ద్వారా చెరువులో మట్టిని పోస్తూ ఆయకట్టు సామర్థ్యంను తగ్గిస్తూ ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు కుంట ఆక్రమణకు గురి కావడంతో పంటలకు పూర్తి స్థాయిలో నీరు అందడం లేదని ఆయకట్టు పరిధిలోని రైతులు గతంలోనే అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులతో ఆయకట్టు విస్తీర్ణం తగ్గి, పెద్ద ఎత్తున నీరు వచ్చినప్పుడు ప్రధాన రహదారితో పాటు సమీప ఇళ్లలోకి నీరు చేరే అవకాశం ఉందని రైతులు, స్థానికులు వాపోతున్నారు.

ఆయకట్టు పరిధి ఇలా..

పట్టణంలో సర్వే నంబర్ 542, 543, 545లో దాదాపు 43 ఎకరాల పరిధిలో మల్లెల పాపయ్య కుంట చెరువు ఉంది. కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ నుంచి ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటితో పాటు, వర్షపు నీరు ఆధారంగా నిండే ఈ కుంట పరిధిలో 300 ఎకరాల వరకు ఆయకట్టు విస్తీర్ణం ఉంది. ఈ కుంట ప్రధాన రహదారికి దగ్గరగా ఉండటంతో భారీ వర్షాలు వచ్చిన సమయంలో చెరువు నిండి ప్రధాన రహదారికి నీరు చేరిన సందర్భాలు ఉన్నాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం 2017–18లో మిషన్ కాకతీయ కింద రూ.12 లక్షలను కేటాయించి పూడికతీతతో పాటు కుంటకట్టకు మరమ్మతులు చేశారు. ఈ కుంట చాలా వరకు జాతీయ రహదారి–167 ఆనుకుని ఉండటంతో ఇప్పటికే చెరువుకు సంబంధించిన చాలా భూమి ఆక్రమణకు గురైందని అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించడంతో పాటు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ జ్యోతిని వివరణ కోరగా.. సాగునీటి అధికారులతో సమన్వయం చేసుకుని సర్వే ద్వారా కుంట యొక్క హద్దులు నిర్ణయిస్తామని అన్నారు. అలాగే ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణకు పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

తాళ్లతో కట్టేసి.. కళ్లలో కారం కొట్టి..

- భర్తపై కొడుకు, మరిదితో భార్య దాడి
- ముగ్గురిపై కేసు నమోదు


తలకు కట్లుతో తిర్పతయ్య

ఖిల్లాఘనపురం: తాళ్లతో కట్టేసి కళ్లలో కారంకొట్టి కొడుకు, మరిదితో కలిసి భార్య దాడిచేసిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున ఖిల్లాఘనపురం మండలం ఉప్పరిపల్లి గ్రామంలో చటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన పిట్టల తిర్పతయ్య హెచ్‌పీ గ్యాస్‌లైన్‌లో పని చేస్తున్నాడు. అతనికి 23 ఏళ్ల క్రితం వనపర్తి పట్టణంలోని రాయిగడ్డకు చెందిన లక్ష్మితో వివాహమైంది. వారికి కుమారుడు, కూతురు జన్మించారు. కొన్ని సంవత్సరాల తర్వాత భార్యాభర్తల మధ్య గొడవ మొదలైంది. దీంతో భార్య పిల్లలను తీసుకోని వెళ్లి వనపర్తిలో తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. ఆరేళ్లుగా భర్తకు దూరంగా ఉంటోంది. విడాకుల కోసం కోర్టులో దరఖాస్తు కూడా చేసుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారు జామున 1గంట సమయంలో లక్ష్మి, కుమారుడు, తమ్ముడు విష్ణుతో తిరుపతయ్య ఇంటికొచ్చి డోరు కొట్టారు. ఎవరని పిలిచినా పలకక పోవడంతో బయటకొచ్చి మూత్రం చేస్తుండగా, పక్కన దాక్కున్న తమ్ముడు బలమైన ఇనుప రాడ్డుతో తిర్పతయ్య తలపై కొట్టాడు. దీంతో కిందపడిన ఆయన కళ్లలో భార్య కారంపొడి చల్లింది. తాళ్లతో కాళ్లను కటేసి ఇంటి ఆవరణలో ఇనుప పైపునకు కట్టేశారు. తీవ్రంగా కొట్టడంతో తట్టుకోలేక తాళ్లను తొలగించుకొని గోడ దూకి పక్కనే ఉన్న జొన్న చొప్పలోకి వెళ్లి దాక్కున్నాడు. వెంబడించిన విష్ణు పట్టుకోని ఇంటి వైపు తీసుకొస్తుండగా కేకలు, ఏడుపులు విన్న చుట్టు పక్కల వారు బయటికొచ్చి చూశారు. ఈ సమయంలో తిరుపతయ్య అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయాడు. గ్రామస్తులు కొందరు 100కు ఫోన్ చేయగా పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకున్నారు. పోలీసులు వెతికి తీవ్ర గాయాలతో ఉన్న తిర్పతయ్యను వెంటనే ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భార్య లక్ష్మి, ఆమె తమ్ముడు విష్ణు, కొడుకుపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. తిరుపతయ్యకు కోటి రూపాయల ఆస్తి ఉందని, దీన్ని అనాథాశ్రమానికి రాస్తానని గ్రామస్తులతో అంటుండేవాడు. ఆస్తి కోసమే అతన్ని చంపడానికి వచ్చారని గ్రామస్తులు పేర్కొన్నారు.

జిల్లా ఆస్పత్రి ఎదుట ఆందోళన..

వనపర్తి: భర్త కొట్టడంతో గాయాలయ్యాయని ఆరోపిస్తూ శుక్రవారం ఖిల్లాఘనపురం మండలం ఉప్పరిపల్లికి చెందిన లక్ష్మి జిల్లా ఆస్పత్రి ఎదుట బైఠాయించింది. పోలీసులు చర్యలు తీసుకునే వరకు వైద్యం చేయించుకోనని పట్టుబట్టింది. ఆమెను శాంతిపజేసి చికిత్స అందించారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

కృష్ణా: మాగనూర్ మండలంలోని వర్కూర్ నుంచి మండలంలోని చేగుంట గ్రామ సమీపంలోని కర్ణాటకకు ఇసుకను అక్రమంగా తీసుకెళ్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు కృష్ణా ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తీసుకెళ్తున్న వాహనాలతో పాటు వాటి యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను కృష్ణా స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

800 కేజీల నల్లబెల్లం పట్టివేత

అచ్చంపేట రూరల్: మండలంలోని మన్నెవారిపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన నిషేధిత నల్లబెల్లాన్ని శుక్రవారం సిద్ధాపూర్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలో కుమార్, తేజ 800 కేజీల నల్లబెల్లం, 75 కేజీల పటిక, 5లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. నిషేధిత నల్లబెల్లం సరఫరా చేసినా, నాటుసారా తయారీకి వాడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువతి అదృశ్యం

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరుకు చెందిన యువతి అనిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు శుక్రవారం తెలిపారు. నరసింహులు, నాగలక్ష్మి దంపతులకు కుమారుడు, కూతురు ఉండగా, కూతురు అనితకు వివాహం నిశ్చయమైందని పేర్కొన్నారు. ఈమె గురువారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో గాలించారు. చుట్టు పక్కల బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో వాకాబు చేశారు. ఆచూకీ లభించకపోవడంతో తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

జడ్చర్ల టౌన్: పట్టణానికి చెందిన సుశీల తన కుమార్తె(19ఏళ్లు) కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 12న మధ్యాహ్నం హాల్‌లో టీవీ చూస్తూ కూర్చుందని, తాను వంట పూర్తిచేసుకుని వచ్చి చూసే సరికి కనిపించకుండా పోయిందని అందులో పేర్కొన్నారు. చుట్టుపక్కలా, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఘటన విషయంలో సందీప్ అనే యువకుడిపై అనుమానాలు ఉన్నాయని ఆమె వివరించారని ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు వివరించారు.

మూడు బైక్‌లు చోరీకి యత్నం

వెల్దండ: మండల కేంద్రంలో గుర్తు తెలియని దుండగులు గురువారం అర్ధరాత్రి బైక్‌ల చోరీకి యత్నించారని స్థానికులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రామస్వామి స్కూటీని ఇంటిఅవరణంలో ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా లక్ష్మారెడ్డి ఇంటి ఆవరణలో ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బంది బైక్ ఉండడంతో దుండగులు ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న మరో ఇంటి ముందు ఉన్న బైక్‌ను ఎత్తుకెళ్లారు. రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు పెట్రోల్‌బంకు ఎదురుగా ఉన్న వెంచర్‌లో బైక్‌లు తిరుగుతున్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి పోలీసులు చేరుకోవడంతో దుండగులు బైక్‌లను అక్కడే వదిలేసి వెళ్లారు. వారిని వెంబడించడంతో చొక్కన్నపల్లి రోడ్డు పక్కన మరో బైక్‌ను వదిలేసి పరారయ్యారు. అదే రాత్రి యాజమానుల ఇంటికి వెళ్లి పోలీసులు వాహనాలను వారికి అందించారు.

అదుపు తప్పిన బస్సు

- ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన బస్సు
- 35 మంది ప్రయాణికులు సురక్షితం


గుంతలోకి దూసుకెళ్లిన బస్సు

మరికల్: ఆత్మకూర్ నుంచి మరికల్ వెళ్తున్న గద్వాల్ డిపో బస్సుకు శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. బస్సులోని 35 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రయాణికుల వివరాల ప్రకారం.. ఆత్మకూర్ నుంచి 35 మంది ప్రయాణికులతో మరికల్ వెళ్తున్న బస్సు జిన్నారం సమీపంలో మలుపు వద్ద స్టీరింగ్ పనిచేయకపోవడంతో అదుపు తప్పిచెట్టుకు ఢీకొట్టి విద్యుత్ స్తంభం పక్కనున్న ముళ్ల పొదలున్న గుంతలో పడింది. దీంతో బస్సులోని ప్రయాణికులు అరుపులు, కేకలు వేసుకుంటూ బయటికి వచ్చారు. ఎలాంటి ప్రాణనష్టం కాలేదు.

బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్


ట్రాక్టర్ బోల్తాపడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బాలరాజు

అచ్చంపేట రూరల్: అచ్చంపేటలో హైదరాబాద్, శ్రీశైలం ప్రధాన రహదారిపై శుక్రవారం అతి వేగంగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ బోల్తా పడింది. రోడ్డు పక్కనున్న చిరు వ్యాపారుల పండ్ల బండ్లపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో వ్యాపారులు లేకపోవడంతో ప్రాణ నష్టం కాలేదు. ఇసుక ట్రాలీ మాత్రమే బోల్తా పడడంతో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. బండ్లపై కొని పండ్లు ధ్వంసమయ్యాయి. అదే సమయంలో దారిలో వెళ్తున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బోల్తాపడిన ఘటనను పరిశీలించారు. అనంతరం జేసీబీతో ఇసుక ట్రాక్టర్‌ను యజమానులు తీసుకెళ్లారు.

ఇసుక అక్రమ రవాణాపై అదుపే లేదు..

ఇసుక అక్రమ రవాణాపై పోలీస్ దాడులు నిర్వహిస్తున్నా అదుపుకాకపోవడంతో అధికార పార్టీకి చెందిన వారే ఈ తతంగం నిర్వహిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. దుందుభీ పరివాహక ప్రాంతం నుంచి రాత్రి సమయాల్లో ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుకను తరలిస్తున్నారు. బుధవారం రాత్రి ప్రత్యేక పోలీసులు 20 బందాలుగా ఏర్పడి ఉప్పునుంతల, అచ్చంపేట, సిద్ధాపూర్, కల్వకుర్తి, తెల్కపల్లి, రఘుపతిపేటతో పాటు వివిధ ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఇసుక టిప్పర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

'దళితబంధు'లో సామాజిక న్యాయమేది?

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

మహబూబ్‌నగర్ రూరల్: దళితులను ఆర్థికంగా ముందుకు తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన దళితబంధు పథకం అమల్లో సామాజిక న్యాయం పాటించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని ఎస్సీ కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలక భూమిక పోషించిన మాదిగలపై సీఎం కేసీఆర్ సవతి తల్లి ప్రేమను చూపుతున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మొట్టమొదటిగా ఇందిరా పార్కు వద్ద అరెస్టు అయిన 9 మందిలో ఐదుగురు మాదిగలే ఉన్నారని, ఆనాటి పోరాటపటిమను రాష్ట్ర సాధన వరకు మాదిగలే ముందుండి పోరాటం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 13 ఎమ్మెల్యే, 2 ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన దళితబంధులో మాదిగలకు అన్యాయం జరుగుతుందన్నారు. అత్యధిక శాతం ఉన్న మాదిగలకు ఎక్కువ యూనిట్లు కేటాయించాలన్నారు. మాదిగల పట్ల మౌనం వీడి న్యాయం చేయాలని, లేనిపక్షంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద వేలాది మందితో సభ నిర్వహించి అన్యాయాన్ని ఎండగడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్, జాతీయ కార్యదర్శి జంబులయ్య, నాయకులు జయమ్మ, ఆంజనేయులు, జయన్న, రాజు, యాదయ్య, రత్నయ్య, సాయి, నాగరాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత చాటేలా ఉపన్యాస పోటీలు


పోటీల్లో గెలుపొందిన వారితో రామాచారి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యార్థులు, చిన్నారుల్లో ఆధ్యాత్మిక, ధార్మికత చాటేలా టీటీడీ, హిందూ ధార్మిక ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 'కథ చెబుతారా–ఊ కొడుతాం' పేరిట ఉపన్యాస పోటీలకు విశేష స్పందన లభించినట్లు టీటీడీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఉత్తరపల్లి రామాచారి తెలిపారు. జిల్లా కేంద్రం శ్రీనివాసకాలనీలోని పద్మాలయ హైస్కూల్‌లో శుక్రవారం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు భారత భాగవత, రామాయణం, భగవద్గీత, పంచతంత్ర కథలలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో ప్రతిఏటా భగవద్గీత శ్లోక కంఠస్థ, ఇతర అంశాల్లో ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండు విభాగాల్లో ఉపన్యాస పోటీలు నిర్వహించగా ప్రాథమిక స్థాయిలో జీ.సాయిరోహణ్, వైష్ణవి, ఆద్యశ్రీ, ఉన్నతస్థాయిలో వర్షిని, మృదుల, ఆర్.హర్ష ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి నగదు బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. ఉపన్యాస పోటీలకు న్యాయనిర్ణేతలుగా శ్రీశైలం, రజిని, వరలక్ష్మి, డాక్టర్ ఉమ్మెత్త మహేశ్వర్, భీమలింగంగౌడ్, రాంప్రకాశ్‌గుప్త వ్యవహరించారు. కార్యక్రమంలో వంశీమోహన్‌రెడ్డి, కేశవులు, హన్మంతురెడ్డి, నరసింహులు, నిర్మలమ్మ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి రిమాండ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్ (హన్వాడ): హన్వాడ మండలంలోని చిర్మల్‌కుచ్చతండా సమీపంలో ఇసుక గుంత తవ్వి నిర్లక్ష్యంగా వదిలేయగా ఇద్దరు పిల్లలు నీటిలో మునిగి చనిపోయిన కేసులో తండాకు చెందిన నందిపేట ఆంజనేయులును అరెస్టు చేసి శుక్రవారం జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవినాయక్ తెలిపారు. కాగా చిర్మల్‌కుచ్చతండాలో పిల్లల మృతికి కారకులైన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించిన వారితో పాటు దౌర్జన్యంగా ఇళ్లలోకి వెళ్లి దాడులు చేసిన వారిపై, ప్రజలను ఉసిగొల్పిన వారిపై, ఇదే విషయంలో కౌన్సిలర్‌పై చేయి చేసుకున్న వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసినట్లు వివరించారు. తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం ముందు తప్పించుకోలేరని ఎస్ఐ పేర్కొన్నారు.

మరో 9 మందికి..


మహమ్మదాబాద్: మండల పరిధిలోని గాధిర్యాల్ అటవీ భూముల ఆక్రమణలో 9మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రేంజ్ అధికారి ముగ్దుంహుస్సేన్ తెలిపారు. గాధిర్యాల్ గ్రామంలో 70 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిలో తమకు పట్టాలు ఉన్నాయని చెట్లు నరికి వ్యవసాయ భూమిగా మార్చుకునేందుకు రైతులు ప్రయత్నించారు. దీంతో అటవీశాఖ అధికారులు సంబంధిత రైతులపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించిట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.



ఏసీజేగా జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి

సాక్షి, హైదరాబాద్: తాత్కాలిక సీజే జస్టిస్ నవీన్‌రావు శుక్రవారం పదవీ విరమణ చేయడంతో ఆ పదవీ బాధ్యతలను సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి స్వీకరించనున్నారు. జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి.. శనివారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. కొత్త ప్రధాన న్యాయమూర్తికి కేంద్రం అనుమతి ఇచ్చి, బాధ్యతలు అప్పగించేంతవరకు జస్టిస్ షావిలి ఏసీజేగా కొనసాగనున్నారు.


వలంటీర్లలో క్రిమినల్ శక్తులున్నాయి: పవన్



సాక్షి ప్రతినిధి, ఏలూరు/తణుకు టౌన్ : వలంటీర్లలో కొన్ని క్రిమినల్ శక్తులు న్నాయని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మరో సారి తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో అనేక వ్యవస్థ లు ఉన్నప్పుడు వలంటీర్లతో సమాంతర వ్యవస్థ నడపటం ఎందుకని ఆయన ప్రశ్నించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో వారాహి విజయయాత్రలో పవన్ మాట్లాడుతూ నాసిరకం మద్యం అమ్ముతున్నారన్నారు.

చెప్పుతో కొట్టేవారు లేకే వలంటీర్లు ప్రశ్నలడుగుతున్నారు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి : చెప్పు తీసుకుని కొట్టేవారు లేకే ప్రభుత్వ సర్వేల పేరుతో వలంటీర్లు ప్రజలను వ్యక్తిగత వివరాలు అడుగుతున్నారని ప్రతిపక్ష నేత చంద్రబాబు అన్నారు. వాళ్లు ఇళ్లలోకి చొరబడుతున్నారని ఆరోపించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మేనిఫెస్టోలో చెప్పిన మహాశక్తి పథకాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజకీయం చేయవద్దని వలంటీర్లను కోరుతున్నట్లు చెప్పారు రాష్ట్రంలోని మహిళల స్థితిగతులను మహాశక్తి కార్యక్రమం ద్వారా మార్చేస్తానని తెలిపారు.

575 కోట్ల పెట్టుబడి 1,600 మందికి ఉపాధి

చందనవెల్లిలో 2 జపాన్ కంపెనీలకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన

- వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల నిరుద్యోగ యువతకు ప్రాధాన్యం
- జపాన్ కంపెనీల కోసం క్లస్టర్ ఏర్పాటుకు సిద్ధమని స్పష్టీకరణ

షాబాద్: రంగారెడ్డి జిల్లా చందనవెల్లిలో రూ.575 కోట్ల పెట్టుబడితో జపాన్‌కు చెందిన డైఫుకు ఇంట్రాలాజిస్టిక్స్ యూనిట్‌కు, నికోమాక్ తైకిషా క్లీన్ రూమ్స్ కంపెనీ ఏర్పాటుకు శుక్రవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు కంపెనీల ద్వారా ప్రత్యక్షంగా 1,600 మందికి, పరోక్షంగా మరికొంత మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని చెప్పారు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు కంపెనీల్లో ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. ఇప్పటికే కంపెనీల యాజమాన్యం స్థానికంగా ఉన్న ఐటీఐని దత్తత తీసుకోవడం జరిగిందని, వారి అవసరాలకు తగ్గట్లు విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

రంగారెడ్డి జిల్లాలో పెట్టుబడులు అభినందనీయం

'తయారీ రంగంలో జపాన్ ప్రపంచానికే ఆదర్శం. ఆ దేశానికి వెళ్లిన ప్రతిసారీ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకుంటాను. నిజానికి అక్కడ సహజ వనరులు తక్కువ. అణుబాంబు దాడిని ఎదుర్కొని కూడా తిరిగి లేచి నిలబడింది. ఉన్న కొద్దిపాటి వనరులను ఉపయోగించుకుని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తు



శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో కాలె యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డి

ఉత్పత్తి, నాణ్యత అంశంలో అందరికంటే ముందుంది. పారిశ్రామిక ఉత్పత్తిలో తమ సత్తా చాటుకుంటోంది. ప్రస్తుతం భారతదేశంలోని ప్రతి ఒక్కరి ఇంట్లో ఏదో ఒక జపాన్ వస్తువు ఉంటుంది. అలాంటి దేశానికి చెందిన రెండు ప్రముఖ కంపెనీలు రంగారెడ్డి జిల్లాలో పెట్టుబడులు పెట్టడం అభినందనీయం..' అని కేటీఆర్ చెప్పారు.

మరిన్ని పెట్టుబడులకు సహకరించండి

'స్థానిక నాయకులు, ప్రజల చొరవతో ఇక్కడికి పెద్ద ఎత్తున కంపెనీలు వస్తున్నాయి. టెక్స్‌టైల్స్ మొదలుకొని ఎలక్ట్రిక్ వాహనాల దాకా విభిన్నమైన కంపెనీలు ఈ ప్రాంతాన్ని తమ కేంద్రంగా ఎంచుకుంటున్నాయి. రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన పారిశ్రామిక వాడగా చందనవెల్లి ఎదుగుతుంది..' అని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. జపాన్ నుంచి మరిన్ని పెట్టుబడులు వచ్చేలా సహకరించాల్సిందిగా జపాన్ కాన్సులేట్‌ను కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. జపాన్ కంపెనీల కోసం అవసరమైతే ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసేందుకు కూడా తాము సిద్ధమని అన్నారు. చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జస్టిస్ నవీన్ రావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం. చిత్రంలో జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, ఏజీ బీఎస్ ప్రసాద్, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు తదితరులు

హైకోర్టుతో 36 ఏళ్ల అనుబంధం

- ఎన్నో మధురానుభూతుల్ని మిగిల్చిందన్న జస్టిస్ నవీన్‌రావు
- తాత్కాలిక సీజే జస్టిస్ నవీన్‌రావు పదవీ విరమణ.. హైకోర్టు ఘన వీడ్కోలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టుతో తనది 36 ఏళ్ల అనుబంధమని, ఎన్నో మధురానుభూతుల్ని మిగిల్చిందని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు అన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి ఈ స్థాయికి చేరుకోగలిగానని, నీతి, నిజాయతీ, క్రమశిక్షణతో ఉంటే ఉన్నత స్థితికి చేరేందుకు ఎవ్వరూ అడ్డుకోలేరు చెప్పారు. హైకోర్టు తాత్కాలిక సీజేగా పదవీ విరమణ సందర్భంగా జస్టిస్ పి.నవీన్‌రావ పదవీవిరమణ సందర్భంగా హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. మొదటి కోర్టు హాల్లో శుక్రవారం జరిగిన ఫుల్ కోర్టు ఆయనకు వీడ్కోలు చెప్పింది. ఈ సందర్భంగా జస్టిస్ నవీన్ రావు మాట్లాడుతూ.. 'హైకోర్టు విభజన సమయంలో న్యాయమూర్తి హోదాలో జస్టిస్ శేషసాయితో కలిసి చేసిన కసరత్తు ఫలితంగా తెలంగాణ హైకోర్టు వ్యవహారాలు సామరస్యంగా కొలిక్కివచ్చాయి. బిల్డింగ్ కమిటీ చైర్మన్‌గా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేయడంతో జిల్లా కోర్టుల్లో కేసుల పరిష్కారానికి వీలైంది. జిల్లా కోర్టుల సంఖ్య పెంపు ప్రయత్నాలు ఫలించడం మంచి పరిణామం. జూనియర్ న్యాయవాదులు కష్టపడాలి' అని సూచించారు.

తెలుగులో తీర్పుతో చరిత్ర..

అంతకుముందు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి మాట్లాడుతూ.. తెలుగు, ఆంగ్ల భాషల్లో తీర్పు వెలువరించి చరిత్రకెక్కారని జస్టిస్ నవీన్‌రావును కొనియాడారు. రైతులకు న్యాయ అంశాలు వివరించే లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేయించారని తెలిపారు. అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. జస్టిస్ నవీన్‌రావు న్యాయవ్యవస్థలో సాంకేతికతను అమలు చేశారన్నారు. కోవిడ్ వేళ వరంగల్‌లో న్యాయవాదులకు సంచార వాహన సౌకర్యం, హనుమకొండలో జిల్లా కోర్టుల ప్రాంగణంలో వసతులు, కల్పతరు పేరిట ఫ్యామిలీ కోర్టులు వంటివి దేశానికే ఆదర్శంగా చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, బార్‌కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు, అదనపు సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, న్యాయవాదులు, న్యాయాధికారులు, కోర్టు సిబ్బంది, జస్టిస్ నవీన్‌రావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీసులకు పతకాలు

సాక్షి, హైదరాబాద్: ఉత్తమ సేవలందించిన పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం పతకాలు ప్రకటించింది. నూతన సంవత్సరంగా సందర్భంగా ఇవ్వాల్సిన ఈ పతకాలను దక్కించుకున్న పోలీసు, అగ్నిమాపక శాఖ, జైళ్ల శాఖల అధికారుల జాబితాను శుక్రవారం విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర శౌర్యపతకం, మహోన్నత సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, కఠిన సేవాపతకం, సేవాపతకం.. మొత్తం ఐదు కేటగిరీల్లో పతకాల విజేతల జాబితాను రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ విడుదల చేశారు.

శౌర్య పతకాలు ఎవరికంటే...

పోలీస్‌శాఖ నుంచి శౌర్య పతకాన్ని గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ పి.సతీశ్ దక్కించుకున్నారు. ఇంటెలిజెన్స్ విభాగం(కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో, స్టేట్ ఇంటెలిజెన్స్ వింగ్)కు చెందిన ఎస్సై ఎస్‌ఎ కరీం, ఏఎస్సై శివ శంకర్, హెడ్ కానిస్టేబుళ్లు ఎండీ ఖాజా మొయినుద్దీన్, ఎస్.రాజవర్ధన్‌రెడ్డి, ఏ. బాలాజీరావు, కానిస్టేబుళ్లు పి మోహన్, కె కిరణ్‌కుమార్, బి.లక్ష్మీ నారాయణ, బి.వీరస్వామి, ఎండీ అలీముద్దీన్‌లకు తెలంగాణ అగ్నిమాపకశాఖ నుంచి శౌర్య పతకం అందుకున్న వారిలో అసెంబ్లీ ఫైర్ స్టేషన్ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ వి.ధనుంజయ్‌రెడ్డి, సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్‌లో ఎస్‌ఎఫ్‌ఓ(స్టేషన్ ఫైర్ ఆఫీసర్)గా పనిచేస్తున్న డి. మోహన్‌రావు, గౌలిగూడ ఫైర్ స్టేషన్ ఎస్‌ఎఫ్‌ఓ ఎన్ ప్రవీణ్‌కుమార్, మొఘల్‌పుర ఫైర్ స్టేషన్ ఫైర్‌మన్ బి.వెంకటేశ్వర రాజు, గౌలిగూడ ఫైర్‌స్టేషన్ ఫైర్‌మెన్ మహ్మద్ అస్గర్, అసెంబ్లీ ఫైర్‌స్టేషన్ ఫైర్‌మన్ టి. హరికృష్ణ, సికింద్రాబాద్ ఫైర్‌స్టేషన్ ఫైర్‌మన్ ఎం.హరికృష్ణలకు దక్కాయి. పోలీస్ శాఖ నుంచి మహోన్నత సేవా పతకాలు 16 మందికి, ఉత్తమ సేవా పతకాలు 94 మందికి, కఠిన సేవాపతకాలు 51 మందికి, సేవా పతకాలు 473 మందికి దక్కాయి.



ధనుంజయ్‌రెడ్డి



మోహన్‌రావు

ఇల్లెందు ఫైర్‌స్టేషన్ డ్రైవర్‌కు మహోన్నత సేవా పతకం

మహోన్నత సేవా పతకం ఖమ్మం జిల్లా ఇల్లెందు ఫైర్‌స్టేషన్ డ్రైవర్ ఆపరేటర్ కే వెంకటేశ్వర్లుకు దక్కింది. ఉత్తమ సేవా పతకాలు ముగ్గురికి, సేవా పతకాలు 14 మందికి దక్కాయి.

ఏసీబీలో...

ఏసీబీలో ఉత్తమ సేవాపతకాలు వరంగల్ రేంజ్ కానిస్టేబుల్ ఏ. నర్సయ్య, నిజామాబాద్ రేంజ్ కానిస్టేబుల్ జి సురేశ్, ఖమ్మం రేంజ్ హెడ్‌కానిస్టేబుల్ టి.క్రిష్ణ సూరిలకు దక్కించుకున్నారు. సేవాపతకాలు 22 మందికి దక్కాయి. విజిలెన్స్ విభాగం నుంచి ఇన్‌స్పెక్టర్ ఎం.హుస్సేని నాయుడు, కానిస్టేబుల్ ఎంఏ మసూద్‌లకు దక్కగా, సేవాపతకాలు ఇన్‌స్పెక్టర్ దండిక మహేశ్, కానిస్టేబుల్ డి.రాజేశ్‌కుమార్ దక్కించుకున్నారు.

ఎస్పీఎఫ్‌లో..

స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు చెందిన వారిలో సబ్ ఇన్‌స్పెక్టర్ డి. తిరుపతిరెడ్డికి మహోన్నత సేవా పతకం దక్కింది. ఉత్తమ సేవా పతకాలు ముగ్గురికి, సేవాపతకాలు 15 మందికి దక్కాయి. కాగా, పతకాల జాబితా ఆరు నెలలు ఆలస్యం కావడంపై సిబ్బందిలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అయితే, ఆలస్యంగానైనా పతకాలు దక్కినందుకు ఒకింత సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టుకు మరో ముగ్గురు న్యాయమూర్తులు

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టుకు మరో ముగ్గురు న్యాయమూర్తులను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం బుధవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసు చేసిన జాబితాలో న్యాయాధికారి సుజన కళాసికం, న్యాయవాదులు లక్ష్మీనారాయణ అలిశెట్టి, అనిల్‌కుమార్ జూకంటి పేర్లు ఉన్నాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ కౌశల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం చేసిన సిఫారసులను కేంద్రం ఆమోదించి రాష్ట్రపతికి నివేదించాల్సి ఉంటుంది. రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే ఈ ముగ్గురూ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులవుతారు. వీరి పేర్లకు రాష్ట్ర గవర్నర్, సీఎం గతంలోనే ఆమోదం తెలిపారు.

అలిశెట్టి లక్ష్మీనారాయణ: నిజామాబాద్ జిల్లా మెండోరా గ్రామంలో హెడ్మాస్టర్ గంగాధర్, రాజుబాయ్ దంపతులకు 1968 మే 13న లక్ష్మీనారాయణ జన్మించారు. నిజామాబాద్ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, కాకతీయ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1994లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేయించుకున్నారు. రాజ్యాంగ, 'సివిల్ లా'లో నైపుణ్యం సాధించారు. ఆయన జాతీయ రహదారుల అభివృద్ధి అథారిటీ, ఎన్‌బీసీసీ, ఓరియంటల్ లైఫ్ ఇన్సూరెన్స్‌తోపాటు పలు ఎల్పీసీ, బ్యాంకులకు స్టాండింగ్ కౌన్సిల్‌గా ఉన్నారు.

కె.సుజన: నల్లగొండ జిల్లా ఆలేరుకు చెందిన మధుసూదన్, ప్రమీల దంపతులకు కె.సుజన 1970 మార్చి 10న జన్మించారు. 1997లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. 2010లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. జూనియర్ సివిల్ జడ్జిగా కొనసాగుతూనే 2012లో జిల్లా జడ్జి పరీక్షలు రాసి ఎంపికయ్యారు. కరీంనగర్ అదనపు జిల్లా జడ్జిగా, నిజామాబాద్ జిల్లా జడ్జిగా, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగాను, జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా పనిచేశారు. గతేడాది నుంచి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా సుజన విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రాణం తీసిన క్రికెట్ బెట్టింగ్



శ్యాం సుందర్‌గౌడ్ (ఫైల్)

మదనాపురం: క్రికెట్ బెట్టింగ్‌లో నష్టపోయి యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గద్వాల్ జిల్లా రాజోళి మండలం ముండ్లదిన్నెకు చెందిన గుండ్రాతి శ్యాంసుందర్‌గౌడ్ (23) క్రికెట్ బెట్టింగ్ అలవాటు పడి గతేడాది దాదాపు రూ.3లక్షలు పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులు మందలించినా బెట్టింగ్ మానుకోలేదు. బెట్టింగ్ కారణంగా ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక కలత చెంది గురువారం అర్ధరాత్రి వనపర్తి రోడ్ – శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్ల మధ్య తిరుమలాయపల్లి శివారులోని రైల్వే గేట్ 92 సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మానస, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైతులు అన్ని పంటలు సాగు చేయాలి

బిజినేపల్లి: రైతులు పత్తి, మొక్కజొన్ననే కాకుండా చిరుధాన్యాలు, నూనె గింజల పంటలన్నింటిని సాగు చేయాలని ఏడీఆర్ మల్లారెడ్డి సూచించారు. శుక్రవారం పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో గిరిజన ఉప ప్రణాళిక పథకం కింద రైతులకు నూనె గింజల పంటల సాగుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏడీఆర్ మాట్లాడుతూ.. మండలంలోని ఎర్రకుంటతండా, రాళ్లచెరువుతండా, నక్కల చెరువుతండాల రైతులకు నూనె గింజల పంటల విత్తనాలు అందజేశామని, వాటిలో సస్యరక్షణ చర్యలు శాస్త్రవేత్తలు సూచించిన విధంగా చేపట్టాలన్నారు. ఈ పంటల సాగులో ఆధునిక పద్ధతులను చేపట్టి పెట్టుబడుల ఖర్చు తగ్గించుకోవాలని, అందుకోసం ఆయా పంటలకు అందుబాటులో ఉన్న యాంత్రీకరణ గురించి రైతులు స్వయంగా అధికారుల్ని అడిగాలని సూచించారు. వ్యవసాయంలో చేపట్టాల్సిన పద్ధతుల గురించి రైతులు శాస్త్రవేత్తలకు సూచించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వాణిశ్రీ, సదయ్య, ఈశ్వర్‌రెడ్డి, మాధురి, గిరిజన రైతులు పాల్గొన్నారు.



శాకాంబరి దేవిగా జోగుళాంబ



అమ్మవారి విశిష్టతను తెలియజేస్తున్న బ్రహ్మశ్రీ అవ్వారి శ్రీనివాస్ శాస్త్రి



శాకాంబరి అలంకరణలో అమ్మవారు

జోగుళాంబ శక్తిపీఠం: దేవీ భాగవతంలోని దుర్గా సప్తశతిలో చెప్పినట్టుగా అమ్మవారిని ఆషాడమాసంలో శాకాంబరి దేవిగా అలంకరిస్తుంటారు. శుక్రవారం జోగుళాంబ అమ్మవారు భక్తులకు శాకాంబరి దేవిగా దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయాలతో అమ్మవారిని అర్చకులు అలంకరించారు. ఉదయం కోర్టు సివిల్ జడ్జి కమలాపురం కవిత, ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ అమ్మవారికి తొలి పూజలు చేశారు. శతాధిక ప్రతిష్టాచార్య బ్రహ్మశ్రీ అవ్వారి శ్రీనివాస్ శాస్త్రి అమ్మవారిని శాకాంబరి అలంకరణలో భక్తులు దర్శించుకోవడం మహద్భాగ్యం అని తెలిపారు. మహాకాళీ మహాలక్ష్మి, మహా సరస్వతి త్రిశక్తి స్వరూపిణి అయిన జోగుళాంబ తల్లిని ప్రకృతి ప్రసాదితమైన సాత్విక కూరగాయలతో అలంకరించి ఖడ్గమాల, త్రిశతి, లలితా పారాయణాలు చేయడం గొప్ప ఫలితాన్ని ఇస్తుందని చెప్పారు.



గద్వాల జిల్లా ఎస్పీ సృజనకు స్వాగతం పలుకుతున్న ఈఓ, అర్చకులు

➪ అమ్మవారిని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దంపతులు వీడియో కాల్ చేసి దర్శించుకున్నారు. అదేవిధంగా గద్వాల జిల్లా ఎస్పీ సృజనకు ఈవో, చైర్మన్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ పూర్ణకుంభ స్వాగతం పలికి ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు.

'దళితబంధు'లో సమాన వాటా కావాలి

- మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి



ధర్నా చేస్తున్న మాల మహానాడు నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: దళితబంధు పథకంలో మాలలకు సమాన వాటా ఇవ్వాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో మాలలకు దళితబంధు పథకం అమల్లో సమాన వాటా కోసం ఒకరోజు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, టీడీపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెట్టుకాడి శ్రీనివాస్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ దళితుల మధ్య చిచ్చుపెట్టడాన్ని సీఎం కేసీఆర్ మానుకోవాలని హితవుపలికారు. మాలలపై అన్ని విధాలుగా వివక్ష చూపుతున్నారని, దళితబంధులో సరైన వాటా ఇవ్వాలన్నారు. మాలలను నిర్లక్ష్యం చేస్తే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వం దళితుల మధ్య చిచ్చుపెట్టకుండా మాలలకు న్యాయమైన వాటా అమలు చేయాలని వీరబ్రహ్మచారి కోరారు. ఇంటి పెద్దలా వ్యవహరిస్తున్న సీఎం కేసీఆర్ అన్ని కులాలకు సమాన వాటా అమలు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మెట్టుకాడి శ్రీనివాస్ పేర్కొన్నారు. ధర్నాలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జి.చిన్న, ప్రధాన కార్యదర్శి అరేందర్, కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, అనంతయ్య, శ్రీనివాస్, సత్తయ్య, యాదగిరి, శేఖర్, కృష్ణ, ఖాజన్న, వెంకటయ్య, ఆనంద్, తిరుపతయ్య పాల్గొన్నారు.

మేలురకం పశుగ్రాసంతో అధిక పాల ఉత్పత్తి

అమ్రాబాద్: మేలు రకం పశుగ్రాసంతో పాల ఉత్పత్తి మరింత పెరిగి పెంపకందారులకు అధిక ఆదాయం లభిస్తుందని ప్రాంతీయ పశుగ్రాస పరిశోధనా కేంద్రం రాష్ట్ర సంచాలకులు బన్వీర్‌సింగ్ తెలిపారు. కోనేరు సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పదర మండలంలోని చిట్లంకుంటలో 30మంది చెంచు రైతులకు ఉచితంగా పశుగ్రాస విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఇచ్చిన గడ్డి విత్తనాలు సాగు చేస్తే నాలుగేళ్ల వరకు గ్రాసం లభిస్తుందని తెలిపారు. గ్రాసం సాగు చేసినప్పటి నుంచి 45రోజుల తర్వాతనే కోయాలని సూచించారు. హైదరాబాద్ పశుగ్రాస క్షేత్రంలో 40రకాల పశుగ్రాస విత్తనాలు లభిస్తాయని సబ్సిడీలపై కూడా అందిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఎప్పుడైన క్షేత్రానికి వచ్చి చూడాలని, గ్రాసం పెంపకంపై శిక్షణ ఇస్తామన్నారు. ఆయన వెంట పశువైద్యాధికారి మారుతి, కోనేరు సంస్థ సిబ్బంది ఇస్మాయిల్, సురేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



రామన్‌పాడులో 1,018 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,018 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ నుంచి వచ్చే నీటిని నిలిపివేశారు. తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

ప్రజా సమస్యలపైనే మా పోరాటం



వీరన్నపల్లిలో ప్రజాహిత పాదయాత్రలో అనిరుధ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

బాలానగర్: ప్రజా సమస్యలను ఎత్తి చూపేందుకే ప్రజాహిత పాదయాత్ర చేపట్టినట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నవాబుపేట మండలంలో నుంచి బాలానగర్ మండలంలోని వీరన్నపల్లి చేరిన పాదయాత్ర వీరన్నపల్లి, ఉడిత్యాల, సూరారం మీదుగా మేడిగడ్డ తండా వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరన్నపల్లి, ఉడిత్యాల, సూరారం, మేడిగడ్డతండాలలో ఎంతో మంది ఇళ్లు లేక దీనస్థితిలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంగా అధికారంలో ఉండి ఇళ్లు లేని పేదలకు ఏం చేసిందని ప్రశ్నించారు. ప్రజల సొమ్ముతో ప్రగతి భవన్, సచివాలయం కట్టుకున్న ముఖ్యమంత్రి పేదలకు హామీ ఇచ్చిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు లేవని ఆయన ఎద్దేవ చేశారు. ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. స్థానిక పరిశ్రమలలో 75 శాతం స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు చేపడతామని అన్నారు. ఏ గ్రామానికి వెళ్లిన ప్రజలు వారి సమస్యలే చెబుతున్నారని బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఏ ఒక్కరు సంతోషంగా లేరన్నారు. నిరుద్యోగుల ఆత్మబలిదానాలు, నీళ్లు, నిధులు, నియామకాలని అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారి ఆత్మలు క్షోభించేలా పాలన సాగిస్తూ నియంతలా వ్యవహరిస్తుందన్నారు. ప్రశ్నించే వ్యక్తులపై అక్రమ కేసులు పెడుతూ ఆనందాన్ని పొందుతున్నారని తెలిపారు. ఆయన వెంట శంకర్‌నాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, భద్రునాయక్, వెంకట్‌నాయక్, హతిరాం, రాఘవేందర్, గణేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్ నియమించాలి

గద్వాల : వేతన సవరణ కమిషన్ జూన్ 30తో ముగియడంతో ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్ వేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అభ్యసన ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్టీయూ జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించిన ప్రభుత్వం, వివిధ కారణాల వల్ల మధ్యలోనే నిలిపేసిందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని బదిలీలు, పదోన్నతులు చేపట్టడానికి అడ్డంకిగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పీఆర్సీ బకాయిలు, సెలవు వేతనం, పదవీ విరమణ బెనిఫిట్స్, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంటు తదితర సప్లిమెంటరీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు యూనుస్ పాషా, నాయకులు గౌరీ శంకర్, పులిపాటి లక్ష్మణ్, కృష్ణయ్య, కిషోర్‌చంద్ర, శంకర్‌నాయక్, చెన్నకేశవులు, సురేందర్‌రావు, భీమన్న, విజయబాస్కర్, రాజన్న, జయరాజు, ఇస్మాయిల్, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సదానందం గౌడ్

తరగతి గదిలో ఊడిపడిన పెచ్చులు

అయిజ: మండలంలోని కొత్తపల్లిలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తృటిలో ప్రమాదం తప్పింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. శుక్రవారం పాఠశాల సమయంలో పైకప్పు పెచ్చులు ఊడి కిందపడ్డాయి. అదృష్టవశాత్తు పిల్లలు కొద్ది దూరంలో ఉండడంతో ఎలాంటి ప్రమాదం కాలేదు. పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ సంఘటనతో పిల్లలు పాఠశాలకు రావాలంటేనే భయపడుతున్నారని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తరగతి గదిలో ఊడిపడిన పెచ్చులు